E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 10-02-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:40 || పేజీలు–6 www.ekaburu.com



పొంగులేటితోనే సీఎంకు పదవీ గండం: నారాయణ » 3లో

## ఏఐని చూసి భయపడకండి



- దానిపై పట్టు సాధించండి..
- మొబైళ్లకు బానిసలుగా మారొద్దు
- 'పరీక్షా పే చర్చా'లో విద్యార్థులకు
- ప్రధాని మోదీ సూచన

ఈకబురు, దిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)ను చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ సాంకేతికతతో నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. 'పరీక్షా పే చర్చా' రెండో ఎపిసోడ్‌లో భాగంగా సోమవారం ఆయన వివిధ రాష్ట్రాల విద్యార్థులతో సంభాషించారు. "కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు వచ్చినప్పుడు ఏదో జరగనుందన్న చర్చ జరిగింది. ఇలాంటి భయాలు వీడండి. కొందరు చిన్నారులు మొబైళ్లకు బానిసలుగా మారుతున్నారు.

తరువాయి 2లో

# భాగ్యనగరం... దోమల మయం

- సోషల్ మీడియాలో నగర ప్రజల వీడియోలు, పోస్టులు వైరల్
- హైటెక్ సిటీలో కనిపించని ఫాగింగ్, స్ప్రేయింగ్
- కాలనీల్లో దోమల స్వైర విహారం - నివారణ చర్యలు మరిచిన యంత్రాంగం

ఈకబురు, శేరిలింగంపల్లి : ""జీహెచ్ఎంసిలో జీవించాలంటే ముందు దోమలను చంపడం నేర్చుకోవాలి.. లేదంటే రక్తం పీల్చే దోమలు మీ ప్రాణాలను హరించడం ఖాయం... అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ నగర జీవి ఆక్రోశం. వీ డోంట్ ట్రబుల్ దీ ట్రబుల్... దీ ట్రబుల్ కేమ్ టూ అస్... అంటూ ఓ స్టార్ డైరెక్టర్ కుమారుడు సెటైర్ వీడియో తీసి ఉక్రోషం... రక్తం పీల్చి, విష జ్వరాల బారిన పడవేస్తున్న దోమలపై యుద్ధం ప్రకటించి ధర్నా నిర్వహించిన నగరంలోని ఓ కాలనీ... రేషన్ దుకాణం ముందు దోమలతో కుస్తీ పడుతున్న ప్రజల అగచాట్లను వీడియో తీసి వైరల్ చేసిన మరో సోషల్ మీడియా వారియర్... ఇంతగా ఆందోళనలు, నిరసనలు వ్యక్తం అవుతున్నా జిహెచ్ఎంసి అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడడం లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేసి, తమ జేబులు నింపుకోవడంపై దృష్టి సారిస్తున్నారు.""



తరువాయి 3లో

## అభివృద్ధి బాధ్యత నాదే..

# ఆశీర్వదించండి

- పాలన బేరీజు వేసి మంచి నిర్ణయం తీసుకోండి
- భారాసకు ఓట్లడిగే అర్హతే లేదు - గల్లీ ఎన్నికలతో మోదీకి ఏం సంబంధం?
- జనగణన అయ్యే వరకు జిల్లాల సరిహద్దులు మార్చవద్దని కేంద్రం ఆదేశాలున్నాయి
- ప్రతి మున్సిపాలిటీకి మాస్టర్‌ప్లాన్ తెస్తాం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడానికి కోర్టులో పిటిషన్ వేసిన వ్యక్తికి మున్సిపల్ ఎన్నికల్లో భారాస టికెట్ ఇచ్చింది. మేం బీసీలకు పార్టీపరంగా 61 శాతం టికెట్లు ఇచ్చాం. ఇదీ మా నిబద్ధత. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా, భారాసల మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది. ఎవరు అభివృద్ధి చేయగలరో ఆలోచించండి. అవసరమైనప్పుడు కేంద్రంపై కొట్లాడటానికి ఈ ప్రభుత్వానికి బేషజాలు లేవు. భారాసలా చీకటి ఒప్పందాలు, కేంద్రంతో కుమ్మక్కవ్వాల్సిన అవసరం మాకు లేదు.

**ఈ కబురు, హైదరాబాద్:**

'పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా తెలంగాణకు చేసిందేమీ లేదు.. పదేళ్ల భారాస పాలనంతా అవినీతిమయం.. రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. వీటన్నింటినీ బేరీజు వేసి సమాజానికి ఏది మేలు చేస్తుందనేది ఆలోచించి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి పురపాలక సంఘం అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేయించి వచ్చే మూడేళ్లలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ముఖ్యమంత్రిగా, పురపాలకశాఖ మంత్రిగా ఈ బాధ్యతను తీసుకుంటానని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, అనంతరం చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. ''సంపూర్ణంగా మాకు సహకరించి ఆశీర్వదిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తాం. వచ్చే మూడేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది.. ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం రెండోసారి గెలుస్తుంది. మోదీని చూసి ఓటువేయాలని భాజపా వాళ్లు అడుగుతున్నారు. ఈ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య వస్తే తీర్చాల్సింది రాష్ట్ర ప్రభుత్వం కాదా?

ఓట్లు వేయించుకుని సీట్లు తెచ్చుకోవడం తప్ప తెలంగాణకు భాజపా ఇచ్చింది ఏమీ లేదు. రాష్ట్రంలో ప్రస్తుత సమస్యలకు ప్రధాన కారణం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కాదా? మళ్లీ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు. నైతికతకు దూరంగా ఉన్న భారాసకు అసలు ఓటు అడిగే అర్హతే లేదు. మొక్కను కూడా మొలవనీయకూడదంటే యాసిడ్ పోసి కడుగుతారు. అలా భారాసని యాసిడ్ పోసి కడిగితే గానీ తెలంగాణ సమాజం దుర్భర

తరువాయి 2లో



3

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!

- రాహుల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆగ్రహం
- 103 మంది సభ్యుల సంతకాల సేకరణ
- సభాపతితో విపక్ష నేత భేటీ..

ఈ కబురు, దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయి.



2

## నక్సలిజంతో ఏ సమాజమూ బాగుపడలేదు

- మిగిలిన మావోయిస్టులూ లొంగిపోవాలి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ఈ కబురు, ఛత్తీస్‌గఢ్: నక్సలిజం వల్ల ఏ సమాజం బాగుపడలేదని, అది ఉన్న చోటల్లా విధ్వంసమే జరిగిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

## కేసీఆర్‌ను తిట్టడం తప్ప

# రేవంత్ చేసిందేమీ లేదు

- ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం
- రెండేళ్లలో భారాస అధికారంలోకి వస్తుంది: కేటీఆర్



ఈ కబురు, పరకాలరూరల్, భూపాలపల్లి : సీఎం రేవంత్‌రెడ్డి నిత్యం కేసీఆర్‌ను తిట్టడం తప్ప చేసిందేమీ లేదని, తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డిని నమ్మి మోసపోయారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

తరువాయి 2లో



## రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లే సమయమొచ్చింది

- అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌లో సాక్ష్యాలు మాయం చేశారు: హరీశ్‌రావు
- రైతుభరోసా ఎగ్గొట్టి, ఎరువుల కరవు తెచ్చారని వ్యాఖ్య

తరువాయి 2లో

# రెండు పార్టీలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి

- భారాసను ఫాంహౌస్‌కు పంపించారు
- కాంగ్రెస్‌కూ అదే గుణపాఠం చెప్పాలి
- ఓటర్లకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



ఈ కబురు, గోదావరిఖని : ముస్లింల ఓట్ల కోసమే ముఖ్యమంత్రి తనను తాను రేవంత్‌ఖాన్‌గా ప్రచారం చేసుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆక్షేపించారు. కాంగ్రెస్ అంటేనే ముస్లింల పార్టీ అని చెబుతున్న సీఎం మజ్లీస్ పార్టీకి బానిసగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా రామగుండం, సుల్తానాబాద్‌లలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో కేంద్రమంత్రి ప్రసంగించారు.

తరువాయి 2లో



## సీషెల్స్ కు భారత్ భారీ ఆర్థిక చేయూత

- రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన మోదీ

ఈ కబురు, దిల్లీ: హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సీషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ, సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య దిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం రూ.1,500 కోట్ల (175 మిలియన్ అమెరికన్ డాలర్ల) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులతో సీషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా మోదీతో హెర్మినీ సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సుస్థిరత, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

తరువాయి 2లో

## తుది దశకు చేరుకున్న



# ఎన్నికల ప్రచారం

- ఈనెల 11న..
- రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు
- పోటీలో ఉన్న అభ్యర్థులు విస్తృత ప్రచారం
- ఓటర్లను ప్రలోభ పెడుతున్న అభ్యర్థులు
- ఓటర్లకు బహుమతులుగా ఫ్రిజ్ లు, కొత్త టీవీలు, వాషింగ్ మెషీన్లు
- మున్సిపల్ ఎన్నికల ప్రలోభాలలో చిత్ర విచిత్రాలు
- గమనిస్తున్న ఎన్నికల అధికారులు

తరువాయి 3



**ఈ-కబురు, తెలంగాణ బ్యూరో)**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం తుదిదశకు చేరుకుంది. ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికల పోలింగ్ జరగనుంది. సోమవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగుస్తుంది. దీంతో ప్రచారం తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రలోభాల పర్వం కూడా మొదలైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా ప్రయత్నిస్తున్నారు.ప్రచార గడువు ముగియడంతో ఓటరు లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో తాయిలాల పంపిణీకి సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో రాత్రి వేళల్లో జరగాల్సింది అంతా జరిగిపోతుంది. రాత్రివేళల్లో సన్నిహితులతో రహస్యంగా ఇంటింటికీ వెళ్లే అభ్యర్థులు, ఓటర్ల చేతులు పట్టుకుని, నజరానాలందించి తమకే ఓటు వేయాలని ప్రమాణాలు చేయించుకుంటున్నారు.ఆయా మున్సిపాలిటీలలో వార్డులలో ఓట్లను ఇవ్వగలిగిన కీలక నేతల ఇళ్ళకు వెళ్తున్నారు.ముఖ్యంగా ప్రలోభాలు రంగారెడ్డి జిల్లాలో చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

**ఈ కబురు, దిల్లీ:**

దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ముమ్మాటికీ 'భారీ చోరీలు/బందిపోటు దోపిడీలే'నని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి ఒక పకడ్బందీ 'ప్రామాణిక నిర్వహణ విధానం' (ఎస్‌ఓపీ) రూపొందించాలని సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. ...2లో



## సర్‌కు ఆటంకాలు సృష్టించనివ్వం

- సుప్రీంకోర్టు ఉద్ఘాటన

**ఈ కబురు, దిల్లీ:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను హడావిడిగా నిర్వహిస్తున్నారని, అనేక మంది అర్హుల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఆటంకాలు సృష్టించేందుకు ఎవరినీ అనుమతించబోమని నొక్కిచెప్పింది. ఈ విషయాన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. సర్ సజావుగా సాగేందుకు ఎలాంటి ఉత్తర్వులు/వివరణలు అవసరమైనా జారీకి తాము సిద్ధమని తెలిపింది. ...2లో



# డిజిటల్ అరెస్టులు బందిపోటు దోపిడీలే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. డిజిటల్ అరెస్టు మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో కుమ్మక్కు కావడం వల్ల జరుగుతుండొచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు మధ్య మన దేశంలో రూ. 52వేల కోట్లకు పైగా సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ ..'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను అరికట్టడానికి 4వారాల్లోగా కార్యాచరణను సిద్ధం చేయాలని హోం శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది.డిజిటల్ అరెస్టుల కేసుల్లో విచారణకు అనుమతులను సీబీఐకి వెంటనే మంజూరు చేయాలని దిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది.డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహార విధానాన్ని సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సమావేశం కావాలని ఆదేశించింది. కేవలం రూ.15 20 వేల పింఛను తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే బ్యాంకుల ఏఐ టూల్స్ ఎందుకు అప్రమత్తం చేయడం లేదని ప్రశ్నించింది.

# సర్‌కు ఆటంకాలు సృష్టించనివ్వం

సర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి .అంజారియాల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో సర్ గురించి మమత వేసిన పిటిషన్ కూడా ఇందులో ఉంది. బెంగాల్‌లో సర్ ప్రక్రియను పట్టాలు తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అక్కడ కొందరు దుండగులు తమ నోటీసులను దహనం చేశారని పేర్కొంటూ ఈసీ దాఖలు చేసిన ప్రమాణపత్రాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో అఫిడవిట్ సమర్పించాలని బెంగాల్ డీజీపీని ఆదేశించింది. మరోవైపు ఓటరు జాబితా సవరణపై తుది నిర్ణయాలను ఎలక్టోరల్ రోల్ అధికారులే తీసుకుంటారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సర్ కోసం బెంగాల్ సర్కారు కేటాయించిన 8,505 మంది గ్రూప్‌బి అధికారులకు సంబంధిత శిక్షణనివ్వాలని సూచించింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకల్లా వారంతా జిల్లా ఎలక్టోరల్ అధికారి లేదా ఈఆర్‌వోకు రిపోర్ట్ చేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# ఏఐని చూసి భయపడకండి



స్మార్ట్ ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. సాంకేతికతను నైపుణ్యాలు పెంచుకోవడానికి వినియోగించుకోవాలి'' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పారు.

**–మంచి నాయకుడి లక్షణాలేంటి?**

మోదీ: నాయకుడిగా ఎదగాలంటే ఎవరూ సాహసించని పనులు చేయాలి. నాయకుడు అంటే ఎన్నికల్లో పోటీ చేయడం, పార్టీలు పెట్టడం కాదు. మీ అభిప్రాయాలను పదిమందికి అర్థమయ్యేలా చెప్పగలగాలి.

**–స్టార్టప్ ఎలా ప్రారంభించాలి?**

స్టార్టప్‌నకు వయసుతో సంబంధం లేదు. విద్యార్థి దశలోనూ ప్రారంభించొచ్చు. ఇందుకోసం మీరు ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయండి. పారిశ్రామికవేత్తలను కలవండి. మీ ఆలోచనలు వారితో పంచుకోండి. ఆ ప్రయాణంలో మీకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. అవి మీకు ఉపయోగపడతాయి.

**–పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?**

మంచి విద్యార్థిగా మారాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించాలి. గొప్ప క్రీడాకారుడు నిరంతరం సాధన చేస్తాడు. పడతాడు.. లేస్తాడు.. విజయం సాధిస్తాడు. చదువూ అంతే. సాధన కీలకం.

-క్రమశిక్షణ, ప్రేరణ.. ఏది ముఖ్యం?

రెండూ ముఖ్యమే. క్రమశిక్షణ లేకపోతే స్ఫూర్తి ఎంత ఉన్నా ఫలితం శూన్యం.

# సీషెల్స్ కు భారత్ భారీ ఆర్థిక చేయూత



సీషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగు దేశమని ప్రధాని పేర్కొన్నారు. 'భారత్-సీషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సీషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం' అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు చెప్పారు.

**నేడు, రేపు తాజ్‌మహల్ మూసివేత**

సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ, తన భార్య వెరోనిక్ హెర్మినీతో కలిసి మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించనున్నారు. ఈ క్రమంలో ఉదయం 9:00 నుంచి 11:30 వరకు సాధారణ సందర్శకులకు ప్రవేశం నిలిపివేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా మంగళవారం థాయ్‌లాండ్ యువరాణి సిరివన్నవారీ నరీరతన కూడా ఆగ్రాకు రానున్నారు. ఆమె ఫిబ్రవరి 11 ఉదయం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. ఈ క్రమంలో భద్రత కారణాల వల్ల రెండురోజులపాటు పర్యాటకుల ప్రవేశం ప్రభావితమవుతుందని అధికారులు తెలిపారు.

# నక్సలిజంతో ఏ సమాజమూ బాగుపడలేదు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పుర్‌లో నిర్వహించిన 'బస్తర్ పండుమ్-2026' సాంస్కృతిక ముగింపు వేడుకకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నక్సలిజాన్ని మార్చి 31 నాటికి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికీ కొందరు మావోయిస్టులు గిరిజన యువతులను తమ దళంలో కొనసాగిస్తుండడంపై అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన మావోయిస్టులందరూ లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని, వారికి గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని సూచించారు. అలా కాదని ఇంకా ఆయుధాలతో విధ్వంసం సృష్టిస్తామంటే మాత్రం తామూ ఆయుధాలతోనే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. 'మేం ఎవరితో పోరాడాలని అనుకోవట్లేదు. గిరిజన సోదరులు, అక్కా చెల్లెళ్లను కాపాడుకోవాలనేది మా లక్ష్యం. ప్రస్తుతం బస్తర్ ప్రాంతం అభివృద్ధి మార్గంలో నడుస్తోంది. పాఠశాలలు తెరవడంతో పాటు రోడ్లు, మొబైల్ టవర్లు, పోస్టాఫీసులు, విద్యుత్తు సౌకర్యాలు కల్పిస్తున్నాం'' అని అమిత్ షా వెల్లడించారు

# అభివృద్ధి బాధ్యత నాదే.. ఆశీర్వదించండి



**––భారాస వాళ్లు నెగ్గితే అభివృద్ధికి సహకరిస్తారా?**

మున్సిపల్ ఎన్నికల్లో భారాస వాళ్లు అక్కడక్కడా నెగ్గితే అభివృద్ధికి సహకరిస్తారా? అహంకారం, విషం, విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారు. పెద్దపెద్ద చదువులు చదివినవారు మాట్లాడే మాటలేనా అవి? కేసీఆర్ క్యాబినెట్ ర్యాంకుతో ప్రతిపక్ష నేత హోదాలో ప్రభుత్వం నుంచి అన్ని వసతులు పొందుతూ శాసన సభలో ఒక్క సమస్యపైనా మాట్లాడలేదు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో భారాసకు ఓటు వేస్తే గెలిచిన వాళ్లు కూడా కేసీఆర్ మాదిరిగా బయటికి వస్తారా?

**––కేసీఆర్, హరీశ్‌రావును సీబీఐ విచారణకైనా ఎందుకు పిలవడం లేదు?**

భారాస పాలనలో ఇసుక, గాలి, నీరు, ఇళ్లు.. ఇలా దేన్నీ వదలకుండా అవినీతికి పాల్పడ్డారు. చివరికి ఫోన్‌లో మాట్లాడుకునే ప్రతిపక్షాలవారిని, జడ్జిలను, జర్నలిస్టులను, సినీతారలను కూడా వదలలేదు. పోలీసు అధికారులు తప్పిదాలకు పాల్పడిన నేరగాళ్లను పట్టుకొచ్చినప్పుడు వారు సిగ్గుతో తలపై ముసుగు వేసుకుంటారు. భారాస నేతలను విచారణకు పిలిచినప్పుడు అలా పోకుండా, ఏదో యుద్ధం చేసి దేశాన్ని గెలిచినట్లు చేతులు ఊపుతూ వెళుతున్నారు. మీ ప్రేమ ఉంటే చాలు.. అంటూ ఇంకేమీ అవసరం లేదని గజ్వేల్ సభలో మోదీతో కేసీఆర్ అన్నారు. మోదీ ప్రేమలో యుగళగీతం పాడుకున్నది మీరు కాదా? అంత పెనవేసుకున్న బంధాన్ని తెలంగాణకు నిధులు తేవడానికి వినియోగించారా? కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని మోదీ, అమిత్‌షా అన్నారు. ఆ కేసును సీబీఐకిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తాం.. మీకు చేతకావడం లేదా అని కిషన్‌రెడ్డి అనడంతో సీబీఐకిచ్చాను. ఆరునెలలైనా కేసీఆర్, హరీశ్‌రావును కనీసం విచారణకు ఎందుకు పిలవడం లేదు. ఫార్ములాఈ కార్ రేసు కేసు ఈడీ దగ్గరున్నా కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? ఇన్నాళ్లు మీరు సహకరించినందువల్లే ఇప్పుడు వారు స్పందించడం లేదు. ఇది క్విడ్ ప్రోకో కాదా?

**––ఇంకెంత కాలం మతరాజకీయాలు చేస్తారు?**

2014 ఎన్నికల వేళ పాలమూరు సభలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఇటీవల జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణకు వచ్చినప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావించి జాతీయ హోదా ప్రకటిస్తారనుకున్నాం. హైదరాబాద్ వరదల సమయంలో ముంపునకు గురైన సందర్భంలో కారుకు కారు, బైకుకు బైకు ఇస్తామని జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి ఆ హామీలకు ఆమోదం తెలిపారు. మూడోవంతు డివిజన్లలో గెలిచాక ఆ ఊసే ఎత్తలేదు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఇప్పుడు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రం నుంచి ఏ మంత్రి వచ్చినా రూ.లక్షల కోట్లు మంజూరు చేశామని చెబుతున్నారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్రానికి రావాల్సిన వాటానే ఇస్తున్నారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే అందులో 42 పైసలే తిరిగిస్తున్నారు. బిహార్‌కు రూ.6.06, మధ్యప్రదేశ్‌కు రూ.2.09, ఉత్తర్‌ప్రదేశ్‌కి రూ.2.90 చొప్పున ఇస్తున్నారు. ఈ వివక్షపై మోదీని కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని గానీ, నీతి ఆయోగ్‌ను ఏ రోజైనా అడిగారా అని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నా. అసదుద్దీన్ ఒవైసీని భూతంగా చూపి ఇంకెంత కాలం మత రాజకీయాలు చేస్తారు?

**––దేవాలయాలకు విజయ నెయ్యి వాడాలని ఆదేశాలిచ్చాం..**

సీబీఐ తిరస్కరిస్తే కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక నిందితుడు ప్రభాకర్‌రావును 20 నెలల పాటు అమెరికాలో దాచిపెట్టారు. ఆయనను తీసుకువచ్చాక కేసు విచారణ వేగం పుంజుకుంది. తమను అరెస్టు చేయమని కేటీఆర్, హరీశ్‌రావు పోటీపడుతున్నారు. ఎవరు జైలుకుపోతే వారే సీఎం అవుతారని అనుకుంటున్నారు. కవిత తానే ముందు జైలుకు పోయి వచ్చా కదా అని అంటున్నారు. అధికారంలో ఉన్నంతకాలం వారంతా కలసి ఉన్నారు. అధికారం పోగానే గొడవలు పడుతున్నారు. వారి గొడవలతో నాకేం సంబంధం? జనాభా లెక్కల నేపథ్యంలో 2026 జనవరి ఒకటి నుంచి 2027 మార్చి 31 వరకూ జిల్లాల సరిహద్దులు మార్చవద్దని కేంద్రం ఆదేశాలున్నాయి. జిల్లాలను మార్చాలనే వ్యక్తిగత ఆసక్తి మాకేం లేదు. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, పెంపు ఉంటుంది. ఆ తరవాత 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జనాభా ప్రాతిపదిక లేదా ప్రోరేటాలో ఏ విధానం తీసుకున్నా నియోజకవర్గాల పెంపుతో తెలంగాణకు, దక్షిణాదికి నష్టమే. ఇప్పుడు రాష్ట్రాలవారీగా లోక్‌సభ నియోజకవర్గాల మధ్య వ్యత్యాసాన్ని అలాగే కొనసాగిస్తూ నియోజకవర్గాల సంఖ్య పెంచాలి. ఉదాహరణకు ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు, తెలంగాణకు మధ్య 63 పార్లమెంటు నియోజకవర్గాల వ్యత్యాసం ఉంది. పెంపు తర్వాత ఇంతే వ్యత్యాసం ఉండేలా అన్ని రాష్ట్రాలకు సమానంగా పెంచితేనే న్యాయం జరుగుతుంది. తెలంగాణ దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యినే వాడాలని ఆదేశాలిచ్చాం. కల్తీకి అవకాశం లేదు'' అని సీఎం చెప్పారు.

**రాష్ట్రమంతటా జూబ్లీహిల్స్ ఫలితం పునరావృతం కావాలి**

**––మున్సిపల్ ఎన్నికలను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి ; ముఖ్యనేతలతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

పోలింగ్ వరకు సమన్వయంతో పని చేస్తే అత్యధిక స్థానాలు దక్కించుకుంటామని... వచ్చే రెండు రోజులు మున్సిపల్ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎలాగైతే సమన్వయంతో పని చేసి విజయం సాధించామో.. ఈ ఎన్నికల్లోనూ రాష్ట్రమంతటా దాన్ని పునరావృతం చేయాలని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షీ నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులతో కలిసి పుర ఎన్నికలపై ముఖ్యమంత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులుగా నియమించిన మంత్రుల నుంచి వారి పరిధిలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో పరిస్థితిని తెలుసుకొన్న తర్వాత, సర్వేల్లో వ్యక్తమైన వివరాలను సీఎం వెల్లడించినట్లు తెలిసింది. కార్పొరేషన్లన్నింటిలో పరిస్థితి మెరుగ్గా ఉందని, పురపాలక సంఘాల్లో మాత్రం కొన్నిచోట్ల ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకోకపోవడం, నాయకుల మధ్య సమన్వయం లోపం, రెబెల్స్‌కు నచ్చజెప్పలేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని చెప్పినట్లు సమాచారం. పోలింగ్ నాటికి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లోని కొన్ని పురపాలక సంఘాలపై ఇన్‌ఛార్జి మంత్రులకు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఓ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో పరిస్థితిపై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వినికిడి. ప్రతిఒక్కరు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బాధ్యతల్లో ఉన్న మంత్రులు మున్సిపాలిటీల వారీగా పరిస్థితిని అంచనా వేసుకొని కాంగ్రెస్ అభ్యర్థులను విజయం వైపు నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలకు, ఇతర నాయకులకు సమస్యలుంటే ఇద్దరితో కలిసి సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

# రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లే సమయమొచ్చింది



ఈ కబురు, మెదక్ : రూ.50 లక్షలతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన కేసు నుంచి తప్పించుకోవడానికి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఉన్న సాక్ష్యాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాయం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం మెదక్ జిల్లాలోని రామాయంపేట, నర్సాపూర్, మెదక్‌లలో నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ.. ''సీఎం జైలుకెళ్లే సమయం వచ్చేసింది. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను పోలీసుల సహకారంతో దహనం చేసేందుకు కుట్ర పన్నారు. జైలుకు వెళ్లాల్సి వస్తుందనే ఆయన నిత్యం మాజీ సీఎం కేసీఆర్‌పై నోరు పారేసుకుంటున్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, భాజపాతో రేవంత్ జట్టుకట్టారు. ఏడుపాయల వనదుర్గామాత, మెదక్ చర్చి సాక్షిగా ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట తప్పారు. పౌరసరఫరాల కుంభకోణం, ఎన్‌టీపీసీ ఫ్లైయాష్, ఫోర్త్ సిటీ ఇలా.. పలు కుంభకోణాలకు పాల్పడ్డారు. రైతుభరోసా ఎగ్గొట్టి, ఎరువుల కరవు తెచ్చారు'' అని హరీశ్‌రావు ఆరోపించారు. ఆయా సభల్లో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నేతలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఫారూఖ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్ చేసిందేమీ లేదు



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన హనుమకొండ జిల్లా పరకాల; భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రసంగించారు. ''రేవంత్‌రెడ్డి హామీలను నెరవేర్చకుండా ప్రజలను నట్టేట ముంచారు. తులం బంగారం, రైతుబంధు, విద్యాభరోసా కార్డుల హామీలు ఏమయ్యాయి? తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి ఎక్కడున్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో భారాస అధికారంలోకి వస్తుంది. అధికారం శాశ్వతం కాదు.. కొందరు పోలీసు అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సంగతి తేలుస్తాం. హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఆడబిడ్డలు నిలదీయాలి. కాంగ్రెస్ వాళ్లు చెల్లని రూ.2 వేల నోట్లు ఇస్తారు జాగ్రత్త. ఎన్నికల్లో భారాస అభ్యర్థులను గెలిపించాలి' అని కేటీఆర్ కోరారు. పరకాల, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, భారాస భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు.

# రెండు పార్టీలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి



గతంలో భారాస కూడా ముస్లింలకు అనుకూలంగా మాట్లాడిందని, ఆ పార్టీని ప్రజలు ఫాంహౌస్‌కు పరిమితం చేశారని గుర్తుచేశారు. రెండు పార్టీలూ రాష్ట్రాన్ని దోచుకున్నాయన్నారు. కేసీఆర్ కుమార్తె కవిత స్వయంగా భారాస పనిఅయిపోయిందని చెప్పారన్నారు. 'అధికారంలో ఉన్న సమయంలో దోచుకొన్న సొమ్ము కోసమే కేసీఆర్ కుటుంబంలో తగాదాలు మొదలయ్యాయి. కారుకు పంక్చరైంది. ఒక్కొక్కరు ఒక్కోటైరు పట్టుకుని తిరుగుతున్నారు' అంటూ ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.2,500, ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.4,000 భృతి అమలు చేయాని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. మంత్రులకు 12 శాతం కమీషన్ ఇవ్వకుండా కాంట్రాక్టర్లు పనులు పొందే పరిస్థితి తెలంగాణలో లేదని ఆరోపించారు.

# తుది దశకు చేరుకున్న ఎన్నికల ప్రచారం

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, శంకరపల్లి, షాద్‌నగర్ సహా మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మున్సిపాలిటీల్లో అభ్యర్థులు ఖర్చుకు వెనకాడటం లేదు. అక్కడ చాలామంది రియల్ ఎస్టేట్ లావాదేవీలు చేస్తున్న వారే ఉండటంతో వారు డబ్బు భారీగా ఖర్చు పెట్టటానికి రెడీ అయ్యారు. తాజాగా ఒక వార్త మొయినాబాద్ మున్సిపాలిటీలో హల్చల్ చేస్తుంది.ఒక వార్డు అభ్యర్థి నలుగురు ఓటర్లున్న ఇంట్లో పాతటీవీ చూసి కొత్తటీవీ పంపించారు. విషయం తెలిసిన ప్రత్యర్థి, కొత్త ఫ్రిజ్‌తో అదే ఇంటికి వెళ్లి మిగతా ఓట్లు తనకు వేయాలని ప్రమాణం చేయించుకున్నారు అని స్థానికంగా జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పుడు మొయినాబాద్ లోనే కాదు రంగారెడ్డి జిల్లా పరిధిలోని అనేక మున్సిపాలిటీల పరిధిలో కొత్త టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్‌లు దర్శనమిస్తున్నాయి.ఇదిలా ఉంటే శంకరపల్లి మున్సిపాలిటీలో అభ్యర్థులు 'టోకెన్ అమౌంట్ 'గా 5,000 పంపిణీ చేశారని సమాచారం. ఎన్నికలయ్యాక ఇంకా నగదు ఇస్తామని హామీ ఇచ్చి ఓటర్లచే ప్రమాణం చేయించుకున్నారని స్థానికంగా చర్చ జరుగుతుంది. జనరల్‌కు రిజర్వ్ అయినందున, గెలిస్తే ఛైర్మన్‌ను అవుతాననుకుంటున్న ఒక అభ్యర్థి మహిళలకు చీరెలు, మిక్సీలతో పాటు నగదును పంచుతున్నారని కూడా సమాచారం.అభ్యర్థుల ప్రలోభాలకు లోనవుతున్న ఓటర్లు కూడా తెలివిగానే ఉన్నారు. వస్తువులు ఇచ్చిన అభ్యర్థులు ఓడిపోతే వస్తువులు తిరిగి ఎక్కడ ఇచ్చెయ్యమంటారో అని ముందే ఊహించి, అభ్యర్థులతో ఇచ్చిన బహుమతులు తిరిగి అడగకూడదని ముందే హామీలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ప్రలోభాలను కట్టడి చెయ్యాల్సిన అవసరం ఉంది, ఓటు అనేది ప్రలోభాలకు లొంగి వేస్తే రేపు వాళ్ళు మీకు ఇచ్చిన దానికి డబుల్ వసూలు చేస్తారని, అలాంటి వాళ్ళను ఎన్నుకోవద్దని అధికారులు చెప్తున్నారు. ఏది ఏమైనా ఇది ప్రతి ఎన్నికల్లో జరిగేదే అని మరి కొంత మంది వ్యాఖ్యానిస్తున్నారు.

# భాగ్యనగరం... దోమల మయం

- సోషల్ మీడియాలో నగర ప్రజల వీడియోలు, పోస్టులు వైరల్
- హైటెక్ సిటీలో కనిపించని ఫాగింగ్, స్ప్రేయింగ్
- కాలనీల్లో దోమల స్వైర విహారం - నివారణ చర్యలు మరిచిన యంత్రాంగం



**ఈ-కబురు, శేరిలింగంపల్లి : ""జీహెచ్ఎంసిలో జీవించాలంటే ముందు దోమలను చంపడం నేర్చుకోవాలి.. లేదంటే రక్తం పీల్చే దోమలు మీ ప్రాణాలను హరించడం ఖాయం... అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ నగర జీవి ఆక్రోశం. వీ డోంట్ ట్రబుల్ దీ ట్రబుల్... దీ ట్రబుల్ కేమ్ టూ అస్... అంటూ ఓ స్టార్ డైరెక్టర్ కుమారుడు సెటైర్ వీడియో తీసి ఉక్రోషం... రక్తం పీల్చి, విష జ్వరాల బారిన పడవేస్తున్న దోమలపై యుద్ధం ప్రకటించి ధర్నా నిర్వహించిన నగరంలోని ఓ కాలనీ... రేషన్ దుకాణం ముందు దోమలతో కుస్తీ పడుతున్న ప్రజల అగచాట్లను వీడియో తీసి వైరల్ చేసిన మరో సోషల్ మీడియా వారియర్... ఇంతగా ఆందోళనలు, నిరసనలు వ్యక్తం అవుతున్నా జిహెచ్ఎంసి అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడడం లేదు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేసి, తమ జేబులు నింపుకోవడంపై దృష్టి సారిస్తున్నారు.""**



వైరల్ గా మారిన కార్తికేయ వీడియో



నగరంలో కనిపించని ఫాగింగ్

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి సంబంధం లేకుండా విజృంభిస్తున్నాయి. నగర ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీజన్ తో సంబంధం లేకుండా దోమలు వ్యాపిస్తున్న తీరుపై నగర ప్రజానికం ఆందోళన చెందుతోంది. దోమల దాడికి వందలాది మంది విషజ్వరాల భారిన పడుతున్నారు. ఫాగింగ్ లేకపోవడం, పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడం, చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించకపోవడం కారణంగా దోమల బెడద ఎక్కువవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మురుగు కాలువలు, నాలల్లో పూడిక తీయకపోడంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల ధాటికి బల్దియా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా హైటెక్ సిటీ దోమల మయంగా మారింది. ఎక్కడ చూసినా తీవ్రమైన దోమల బెడదతో ప్రజలు అల్లాడుతుంటే, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం మొద్దునిద్రలో ఉంటున్నారు. గతకొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ పనులను దాదాపుగా జీహెచ్ఎంసీ ఆపేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాయంత్రం అయితే ఇళ్లు, బాల్కనీలు, అపార్ట్మెంట్లు, ఓపెన్ ప్లేసుల్లో లక్షల కొద్దీ దోమలు విజృంభిస్తున్నాయి.

**రోగాల బారిన పడుతున్న ప్రజలు...**

దోమల స్వైర విహారంతో నగర ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సాయంత్రం అయ్యిందంటే ఇంటి తలుపులు, కిటికీలు బిగించి మూసివేసినా దోమల నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నారు. దోమల కాటుతో ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల బారిన పడుతున్నారు. హైటెక్ సిటీ పరిధిలో జ్వర బాధితులు రోజురోజుకు పెరుగుతుండడంతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రజలు ఇంతగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు.


**సోషల్ మీడియాలో వైరల్ పోస్టులు...**

కాగా దోమల సమస్యపై అధికారులు పట్టించుకోవడం లేదంటూ నగర ప్రజలు సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ మధ్యే ప్రముఖ దర్శకుడు రాజమౌళి కుమారుడు, దర్శకుడు ఎస్ఎస్. కార్తికేయ చేసిన సెటైరికల్ వీడియో జిహెచ్ఎంసిని షేక్ చేస్తుంది. ఓ మూవీ షూటింగ్ వర్క్స్ లో బిజీగా ఉన్న కార్తికేయ.. షూటింగ్ లో దోమలు తమ చిత్ర యూనిట్ ను ఎంతలా ఇబ్బంది పెడుతున్నాయో తెలియచేస్తూ ఓ వీడియోను వ్యంగ్యంగా షూట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ గా మారింది. దీనితో పాటు నగరంలో రేషన్ దుకాణం ముందు లైన్ లో వేచిఉన్న ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్న వీడియో సైతం వైరల్ గా మారింది. ఉప్పల్ లోని ఓ కాలనీ ప్రజలు దోమల సమస్యపై ధర్నా చేపట్టడం విశేషం. ప్రముఖ సోషల్ మీడియా సైట్ లు మొత్తం నగర ప్రజల దోమల సమస్యలతో నిండిపోవడం.. ప్రజలు పడుతున్న ఇబ్బందులను, అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది.




నగర వాసి సోషల్ మీడియాలో చేసిన పోస్టు

# లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం!



ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు సమాచారం. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో ఈ డిమాండును విపక్షాలు తెరపైకి తీసుకువస్తున్నాయి. రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో.. తృణమూల్, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొని ఈ నిర్ణయానికి వచ్చాయి. లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు దీనిని ఎప్పుడు సమర్పించాలో మంగళవారం నిర్ణయిస్తారు.

-- ..వీటిపై మాట్లాడనివ్వండి

రాహుల్, మరికొందరు విపక్ష ఎంపీలు సోమవారం ఓం బిర్లాతో సమావేశమయ్యారు. సభలో ప్రతిష్టంభన తొలగింపుపై చర్చించారు. రాహుల్ తాను లేవనెత్తదలచిన అంశాలను వివరించారు. వాటిపై మాట్లాడనిస్తే చర్చకు సిద్ధమేనని చెప్పారు. రాహుల్ వెంట వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టి.ఆర్.బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. వారు వేర్వేరు అంశాలను లేవనెత్తారు. ప్రభుత్వంతో మాట్లాడి చెబుతానని స్పీకర్ వారికి తెలిపారు. రాహుల్ ఒక్కరే మాట్లాడి మిగిలినవారికి అవకాశం కల్పించకపోతే కుదరదని ప్రభుత్వం పేర్కొంటోంది. ఎంపీల నుంచి ప్రధానికి ముప్పు ఉన్నట్లయితే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ విలేకరులకు చెప్పారు. తాను సభలో ఏం చెబుతానోనన్న భయంలో ప్రధాని ఉన్నారని, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. నరవణె పుస్తకాన్ని తాను ఇస్తానని మోదీ భయపడిపోతున్నారని చెప్పారు.

-- 'స్పీకర్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు'

స్పీకర్‌పై అధికారపార్టీ ఒత్తిడి ఉందని, ఆయన సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆరోపించారు. ఆయనను ఉద్దేశించి ఈ మేరకు లేఖ రాశారు. ''సభకు ప్రధాని మోదీ గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, మీరు అధికార పార్టీ ఒత్తిడి మేరకు మాపై నిరాధార ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా మీరు వ్యవహరించాలి'' అని వారు ఓం బిర్లాను కోరారు. లేఖపై ప్రియాంకా గాంధీ సహా పలువురు సంతకాలు చేశారు.

-- ఆ పదవిపై గౌరవం ఉంది

''మాజీ ప్రధానులపై అసభ్యకరంగా మాట్లాడిన భాజపా ఎంపీలపై మీరు ఎలాంటి చర్య తీసుకోలేదు. మీరు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని అర్థమవుతోంది. మీపై మాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. మీరు నిరంతరం అధికార పార్టీ ఒత్తిడిలో ఉంటున్నారు'' అని మహిళా ఎంపీలు లేఖలో పేర్కొన్నారు. 'మేం సభకు వెళ్లడం, వెంటనే బయటకు రావడం చాలా విచారకరం. ఇది ప్రజాస్వామ్యం కాదు. మేం ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లు?' అని ప్రియాంక విలేకరుల వద్ద అన్నారు.

--రాజ్యసభ నుంచి విపక్షం వాకౌట్

పార్లమెంటులో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. రాహుల్‌ను మాట్లాడనివ్వాలనే డిమాండులో సభను విపక్షం స్తంభింపజేసింది. ఇరుపక్షాలూ తమతమ వాదనలు వినిపించాయి. చివరకు సభ మంగళవారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఇదే అంశంపై ఖర్గే మాట్లాడటానికి అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ సహా విపక్షాలు వాకౌట్ చేశాయి. వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌పై డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ.. సభాహక్కుల తీర్మాన నోటీసు ఇచ్చారు. పార్లమెంటు జరుగుతున్నప్పుడు అమెరికా వాణిజ్య ఒప్పందంపై బయట ప్రకటన చేయడాన్ని తప్పుబట్టారు.

--చర్చ జరగకపోతే విపక్షానికే నష్టం;రిజిజు

సభలో సంఖ్యాబలం తమకున్న దృష్ట్యా ఏ బిల్లునైనా ఆమోదించుకోవడంలో ఇబ్బంది ఉండదని, చర్చ జరగకపోతే ప్రతిపక్షానికే నష్టమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. స్పీకర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టినా ఆయన్ని తొలగించడానికి కావాల్సినంత బలం విపక్షాలకు లేదని చెప్పారు. స్పీకర్ వ్యవస్థను కించపరిచేలా విపక్షం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సభలో ప్రధాని భద్రతపై స్పీకర్ ఆందోళన చెందడానికి తగిన కారణాలు ఉన్నాయని, వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకే ఆయన నిర్ణయాలు తీసుకున్నారని లోక్‌సభ సచివాలయం స్పష్టంచేసింది.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి : కొమిరిశెట్టి సాయిబాబా



బీఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న సాయిబాబా



ఎన్నికల ప్రచార సభలో కార్తీక్ రెడ్డి, సాయిబాబా

**చివరిరోజు ఎన్నికల ప్రచారంలో కార్తీక్ రెడ్డితో కలిసి పాల్గొన్న సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రజల సమస్యలను గాలికి వదిలేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలని, తగిన గుణపాఠం చెప్పాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు శంకర్ పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పి.కార్తీక్ రెడ్డితో కలిసి ప్రచార పర్వంలో సాయిబాబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అనంతరం హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో తెలంగాణ అభివృద్ధి తిరోగమనంలో సాగుతుందని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తెరలేపారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మరోసారి కెసిఆర్ ను ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి పలు వార్డుల్లో సాయిబాబా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం జంగయ్య యాదవ్, దార్గుపల్లి నరేష్, శామ్లెట్ శ్రీనివాస్, దారుగుపల్లి పరమేష్‌లతో పాటు స్థానిక బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంజయ్య నగర్ లో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని జలమండలి జిఎంకు వినతి



జలమండలి జీఏంకు వినతిపత్రం సమర్పిస్తున్న అంజయ్య నగర్ వాసులు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అంజయ్య నగర్ లో తాగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానికులు జలమండలి జనరల్ మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య నగర్ వాసులు మాట్లాడుతూ అంజయ్య నగర్ బస్తీలో తాగునీటి సమస్య స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పలు ప్రాంతాల్లో నీటి సరఫరా జరగకపోగా, మరికొన్ని ప్రాంతాల్లో లోప్రెజర్ తో త్రాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. ఇప్పటివరకు పైప్ లైన్ నెట్వర్క్ లేని ప్రాంతాల్లో కొత్తగా పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని కోరారు. దీంతోపాటు లో ప్రెజర్ సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఆంజనేయులు సాగర్, మన్నెంకొండ సాగర్, ఎస్. చిన్న సాగర్, పి.భాస్కర్, చంద్రమోహన్ శెట్టి, ,ఏ.భీమేష్, హబీబ్, శభాష్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానికుల సమస్యపై స్పందించిన జనరల్ మేనేజర్ సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# సెంట్రల్ యూనివర్సిటీలో దొంగలు పడ్డారు...




హెచ్ సి యు



వర్సిటీలోని సీ ఆర్ రావు విభాగం

ఈకబురు, శేరిలింగంపల్లి : చుట్టూ రక్షణ ప్రహరీ గోడ... ఉన్న మూడు గేట్ల ద్వారానే లోపలికి వెళ్లే అవకాశం... గేట్ల వద్ద పటిష్టమైన సెక్యూరిటీ వ్యవస్థ... వర్సిటీ వర్గాలకు తప్పితే ఇతరులెవరికి (కనీసం రాజకీయ నాయకులు, మీడియాకు సైతం) అనుమతి లేదు.. కానీ ఇంతటి బందోబస్తు మధ్య హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చోరీ జరిగింది. ఏకంగా క్లాస్ రూమ్ లో ఉన్న 50 లాప్ టాప్ లను దుండగులు చంకలో పెట్టుకొని పరారయ్యారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో చోటుచేసుకున్న చోరీ ఘటన సంచలనంగా మారింది.. శుక్రవారమే యూనివర్సిటీకి తెచ్చి క్లాస్ రూమ్ లో పెట్టిన లాప్ టాప్ లు ఆదివారం చోరీకి గురికావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గల సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ విభాగం తరగతి గదిలోకి కొత్తగా శుక్రవారం 50 లాప్ టాప్ లు తెచ్చి పెట్టారు. కాగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కిటికీ గ్రిల్స్ తొలగించి సదరు గదిలోకి ప్రవేశించారు. క్లాస్ రూమ్ లో ఉన్న 50 ల్యాప్ టాప్ లను దుండగులు చోరీ చేసి అక్కడి నుంచి ఉడాయించారు. తరగతి గదిలో ల్యాప్ టాప్ లు మాయం కావడం సోమవారం ఉదయం గమనించిన వర్సిటీ యాజమాన్యం గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు తరగతి గది కిటికీ గ్రిల్స్ తొలగించి ఉండడం, కారు టైర్ గుర్తులు ఉన్నట్లుగా గుర్తించారు. వివరాల కోసం వర్సిటీలోని సిసి కెమెరాలను మొత్తం పరిశీలిస్తున్నారు. కాగా సిఆర్ రావు ఇనిస్టిట్యూట్ విభాగం తరగతి గదిలో భారీ ఎత్తున ల్యాప్ టాప్ లు ఉన్నాయని తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దీంతో సదరు విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది, విద్యార్థుల వివదాలను మొత్తం సేకరిస్తున్నారు. కాగా మొత్తం 50 ల్యాప్ టాప్ లు చోరీకి గురికావడంతో చోరీలో పాల్గొన్న వారు ఒక్కరు అయ్యే అవకాశం లేదని, ఎక్కువ మంది కలిసి ఈ చోరీ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా చోరీకి గురైన లాప్ టాప్ లు శుక్రవారం రోజే వర్సిటీకి తీసుకురాగా, వీటి విలువ లక్షల్లో ఉంటుందని తెలుస్తుంది. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు. నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పొంగులేటితోనే సీఎంకు పదవీ గండం: నారాయణ

ఈ కబురు, ఏదులాపురం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదవి ముప్పు ఏర్పడితే అది రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వల్లే జరుగుతుందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ విమర్శించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఆయన సీపీఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. 'జాతీయ స్థాయిలో ఉన్న పొత్తులను కాదని కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలకు పాల్పడింది. ఐదేళ్ల క్రితం పొంగులేటి ఏ పార్టీలో ఉన్నారో తెలుసుకోవాలి. పార్టీలు మారే నాయకులకు ప్రజల్లో గుర్తింపు ఉండదు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టులకు కంచుకోట. కమ్యూనిస్టులు తల్లిపాల వంటివారు. తల్లి పాలకు, డబ్బా పాలకు మధ్య ఈ పోటీ జరుగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ గెలిస్తే ముఖ్యమంత్రి పదవి పోతుందా? మొత్తం పురపాలికలు కాంగ్రెస్‌కే దక్కాలనే రాజకీయ దురుద్దేశంతోనే పొత్తులు కుదరనీయలేదు. సమస్యలు పరిష్కరించే వారికే ప్రజలు ఓటేయాలి' అని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేశ్ పాల్గొన్నారు.

## పీఎఫ్ విత్‌డ్రా మరింత సులభం!




ఈపీఎఫ్ఓ చందాదారులు.. తమ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (EPF)ను ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకోవడానికి ఉపయోగపడే ఫీచర్ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు.. కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయా గతంలోనే వెల్లడించారు. ఇప్పుడు దీనికి సంబంధించిన కొత్త మొబైల్ అప్లికేషన్‌ను 2026 ఏప్రిల్ నాటికి ప్రారంభించనున్నారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రారంభించనున్న మొబైల్ అప్లికేషన్ ద్వారానే.. 8 కోట్ల మంది సభ్యులు తమ ప్రావిడెంట్ ఫండ్ (EPF)ను యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) ద్వారా నేరుగా విత్‌డ్రా చేసుకోవచ్చు. EPFO 3.0 అప్‌గ్రేడ్‌లో భాగంగా తీసుకొస్తున్న ఈ కొత్త విధానం వినియోగదారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.ప్రస్తుతం పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవాలనుంటే.. అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి కొంత సమయం పడుతుంది. దీనిని మరింత సులభతరం చేయడానికి యూపీఐ విత్‌డ్రా తీసుకురావడం జరుగుతోంది. కాగా ఇప్పటికే ఆటో సెటిల్‌మెంట్ మోడ్ లిమిట్ రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచారు.

ఈపీఎఫ్ఓ సభ్యులు తమ బ్యాంక్ ఖాతాలకు యూపీఐ పిన్ ఉపయోగించి ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవడానికి అర్హత కలిగి ఉన్నారో ఆ మొత్తాన్ని వెంటనే విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఒకసారికి కేవలం రూ. 25వేలు విత్‌డ్రా చేసుకోవచ్చు.

యాప్‌లో మీరు ఎంత మొత్తంలో విత్‌డ్రా చేసుకోవచ్చు అనేది కనిపిస్తుంది.

ప్రస్తుతం ఈ విధానం ఎలా పనిచేస్తుంది అని తెలుసుకోవడానికి ట్రయల్ రన్స్ చేస్తున్నారు. తద్వారా ఏదైనా సాంకేతిక సమస్యలు ముందే గుర్తించి పరిష్కరించవచ్చు. కొత్త యాప్ ప్రధాన మొబైల్ ఇంటర్ఫేస్‌గా యూపీఐ విత్‌డ్రా కోసం ఉపయోగిస్తారు. అయితే అధికారిక వెబ్‌సైట్, ఉమాంగ్ యాప్ కూడా ఇతర సేవల కోసం ఉపయోగించుకోవచ్చు.

## బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలు.. కారణం ఇదే..!

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇటీవల భారీగా పతనం అయిన ఈ రెండు లోహాల ధరలు మళ్లీ పైకెళుతున్నాయి. ఫ్యూచర్స్ మార్కెట్‌లో వెండి దాదాపు 5 శాతం మేర పెరిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో (MCX) వెండి కిలో మార్చి నెల కాంట్రాక్ట్ 4.74 శాతం మేర పెరిగి రూ.2,61,745కి చేరింది. అంటే రూ.11 వేలు పెరిగింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఏప్రిల్ కాంట్రాక్ట్ 1.3 శాతం పెరిగి రూ.1,57,540కి చేరింది. అంటే దాదాపు రూ.2 వేలు పెరిగింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ మళ్లీ 5 వేల డాలర్ల మార్కు దాటింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఔన్సు పసిడి ధర 5004 పలుకుతుండగా.. వెండి ఔన్సు 81 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.1.60 లక్షలు పలుకుతుండగా.. వెండి ధర రూ.2.70 లక్షల పైనే కొనసాగుతోంది. బంగారం, వెండిలో ఇటీవల భారీ కరెక్షన్ కారణంగా ధరలు దిగొచ్చాయి. వెండి ఏకంగా సగం వరకు పతనం అయ్యింది. దీంతో కనిష్ఠాల వద్ద ట్రేడర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభిస్తోందని అనలిస్టులు పేర్కొంటున్నారు. డాలర్ విలువ పతనం కావడమూ మరో కారణం. మరోవైపు చైనా సెంట్రల్ బ్యాంక్ వరుసగా 15వ నెల కూడా పెద్ద మొత్తంలో పసిడిని కొనుగోలు చేయడంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ, ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ పరపతి విధాన నిర్ణయాలు.. బంగారం, వెండి ధరలను ప్రభావితం చేయొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు లోహాల్లో ఇటీవల భారీస్థాయిలో కుదుపు రావడానికి చైనా ట్రేడర్ల స్పెక్యులేటివ్ ట్రేడింగే కారణమని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.



## లెదర్ ఫినిష్‌తో శాంసంగ్ నుంచి లేటెస్ట్ స్మార్ట్ ఫోన్



దక్షిణ కొరియాకు చెందిన శాంసంగ్ సంస్థ బడ్జెట్ సెగ్మెంట్‌లో ఓ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఎఫ్70 సిరీస్‌లో గెలాక్సీ ఎఫ్70ఈ (Samsung F70e 5G) పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీ, లెదర్ ఫినిష్ ప్యానెల్‌తో ఈ స్మార్ట్‌ఫోన్ శాంసంగ్ విడుదల చేసింది. ఫీచర్లు ఇవే.. శాంసంగ్ ఎఫ్70ఈ ఆండ్రాయిడ్ 16తో కూడిన వన్‌యూఐ 8పై పని చేస్తుంది. ఈ ఫోన్‌కు ఆరేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ పేర్కొంది. ఇందులో 6.7 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120 Hz రిఫ్రెష్ రేటుతో పనిచేస్తుంది. ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్‌సిటీ 6300 ప్రాసెసర్ ఇచ్చారు. అంటుటు బెంచ్‌మార్క్‌లో 6.23 లక్షల పాయింట్లు స్కోర్ చేసినట్లు కంపెనీ పేర్కొంది.ఇందులో 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ డెప్త్ సెన్సర్, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ 199 గ్రాములు బరువు ఉంటుంది. ఇక ధర విషయానికొస్తే.. ఈ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.12,999గా కంపెనీ నిర్ణయించింది. 6జీబీ+ 128 జీబీ వేరియంట్ ధర రూ.14,999గా పేర్కొంది. ఫిబ్రవరి 17 నుంచి ఫ్లిప్‌కార్ట్, శాంసంగ్ ఆన్‌లైన్ స్టోర్‌లో విక్రయానికి రానుంది.

## యాపిల్ ఫోన్‌నూ మడతెట్టేయొచ్చు..?



శాంసంగ్, వివో, గూగుల్, వన్ ప్లస్ వంటి కంపెనీలన్నీ ఫోల్డబుల్ ఫోన్స్ లాంచ్ చేసి, విక్రయిస్తున్న తరుణంలో.. యాపిల్ కూడా ఫోల్డబుల్ ఫోన్ లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఈ ఏడాది ఐఫోన్ 18 ప్రో & ప్రో మాక్స్ లాంచ్ సమయంలో విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం.ఇప్పుడు చాలామంది స్మార్ట్‌ఫోన్ వినియోదాగారులు ఫోల్డబుల్ ఫోన్స్ ఉపయోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే యాపిల్ కూడా ఫోల్డబుల్ ఫోన్ లాంచ్ చేయనున్నట్లు చెబుతున్నారు. అయితే.. ఈ విషయంపై కంపెనీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.ప్రస్తుతం వైరల్ అవుతున్న వార్తల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డ్ కోసం ఓఎల్ఈడీ డిస్‌ప్లేలను శాంసంగ్ ఉత్పత్తి చేయనుంది. ఎందుకంటే.. శాంసంగ్ అత్యుత్తమ ఫ్లెక్సిబుల్ డిస్‌ప్లే టెక్నాలజీ కలిగి ఉంది.ఐఫోన్ ఫోల్డ్ మార్కెట్లో లాంచ్ అయితే దీని ధర కూడా ఎక్కువగా (సుమారు 2399 డాలర్లు) ఉండే అవకాశం ఉందని ప్రముఖ రీసర్చ్ అనలిస్ట్ ఆర్థర్ లియావో పేర్కొన్నారు. ఫోల్డబుల్ ఐఫోన్ డిజైన్ పరంగా రెండు విధాలుగా ఉండవచ్చని అంచనా. ఒకటి బుక్ స్టైల్ ఫోల్డ్(ఫోన్ తెరిస్తే టాబ్లెట్ లాంటి పెద్ద స్క్రీన్), మరొకటి ఫ్లిప్-స్టైల్ ఫోల్డ్ (మడిచినప్పుడు చిన్నదిగా మారే డిజైన్). బ్యాటరీ విషయంలో.. పెద్ద స్క్రీన్‌కు సరిపడే విధంగా అధిక సామర్థ్యం గల బ్యాటరీతో పాటు, పవర్ ఎఫిషియెన్సీపై యాపిల్ ప్రత్యేక శ్రద్ధ పెట్టే అవకాశం ఉంది. అనుకున్న విధంగా ఐఫోన్ ఫోల్డ్ మార్కెట్లో లాంచ్ అయితే.. దీనికి కూడా మంచి డిమాండ్ ఉండే అవకాశం ఉందని సమాచారం.

## మ్యూచువల్ ఫండ్ కొత్త స్కీములు

ముంబై: కోటక్ మహింద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ.. కోటక్ సర్వీసెస్ ఫండ్ పేరుతో కొత్త పథకాన్ని (ఎన్ఎఫ్ఓ) ప్రారంభించింది. ఈ నెల 18 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. దేశ జీడీపీలో 55 శాతం వాటా ఆక్రమిస్తూ, వృద్ధికి కీలక చోదకంగా ఉన్న సేవల రంగంలో పెట్టుబడులకు ఈ పథకం వీలు కల్పిస్తుందని కోటక్ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది.వినియోగ సేవలు, టెలికం, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, ఐటీ, విద్యుత్, ఆయిల్ అండ్ గ్యాస్ తదితర రంగాలతో కూడిన సేవలు దీర్ఘకాల పెట్టుబడులకు మంచి వృద్ధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొంది. మంచి వృద్ధి అవకాశాలు, సహేతుక ధరల వద్దనున్న కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. వ్యాపారం, యాజమాన్యం, కంపెనీ విలువకు ప్రాధాన్యం ఇస్తుంది. అన్ని రకాల మార్కెట్ విలువల్లోనూ పెట్టుబడులు పెడుతుంది.నాణ్యమైన వ్యాపారం, బలమైన నగదు ప్రవాహాలను చూస్తుంది. కనీసం రూ.1,000, అంతకుమించి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎన్ఎఫ్ఓ ముగిసిన కొన్ని రోజుల అనంతరం తిరిగి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో, దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని కోరుకునే వారికి ఈ పథకం అనుకూలమని కోటక్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది.

**360 వన్ ఎంఎఫ్ నుంచి సిఫ్ పథకం**

సంపన్న ఇన్వెస్టర్ల కోసం 360 వన్ మ్యుచువల్ ఫండ్ తాజాగా డైనాసిఫ్ ఈక్విటీ లాంగ్-షార్ట్ ఫండ్ పేరిట స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సిఫ్)ని ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 20న ముగుస్తుంది. ఇది కనీసం 80 శాతం నిధులను ఈక్విటీలు, ఈక్విటీ డెరివేటివ్స్‌కి కేటాయిస్తుంది. ఈక్విటీ డెరివేటివ్స్ ద్వారా 25 శాతం వరకు షార్ట్ ఎక్స్‌పోజర్ తీసుకునేందుకు, డెట్ అలాగే ఇన్విట్స్‌లో 20 శాతం వరకు ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఉంటుంది. దీనికి బీఎస్ఈ 500 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. కనీసం రూ. 10 లక్షలు (అక్రెడిటెడ్ ఇన్వెస్టర్లయితే రూ. 1,00,000) ఇన్వెస్ట్ చేయొచ్చు. మ్యుచువల్ ఫండ్స్ పరమైన ట్యాక్సేషన్ ప్రయోజనాలతో పాటు మరింత మెరుగైన రాబడులను అందించే విధంగా ఈ ఫండ్ ఉంటుందని 360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఈవో రాఘవ్ అయ్యంగార్ తెలిపారు.

డీఎస్‌పీ మల్టీ అసెట్ ఆమ్ని ఎఫ్‌వోఎఫ్

ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియను సరళతరం చేసే దిశగా డీఎస్‌పీ మ్యుచువల్ ఫండ్ సంస్థ మల్టీ అసెట్ ఆమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్)ని ప్రవేశపెట్టింది. ఇది ఫిబ్రవరి 19 వరకు అందుబాటులో ఉంటుంది. సంస్థకు చెందిన స్వంత మార్కెట్ ఇంటెలిజెన్స్ ఫ్రేమ్‌వర్క్ డీఎస్‌పీ నేత్ర దన్నుతో ఇది పని చేస్తుంది. ఈక్విటీ, డెట్ ఆధారిత స్కీములు, గోల్డ్..సిల్వర్ ఈటీఎఫ్‌ల్లాంటి కమోడిటీ ఆధారిత స్కీములు మొదలైన వాటిలో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి ఈక్విటీ ఆధారిత స్కీముల్లో 25-75 శాతం, డెట్ స్కీముల్లో 15-50 శాతం, గోల్డ్-సిల్వర్ ఈటీఎఫ్‌లలో 10-50 శాతం మేర ఇది పెట్టుబడులు పెట్టొచ్చు. మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు ఈక్విటీల్లో పెట్టుబడులను కనిష్టంగా 25 శాతానికి కూడా తగ్గించే వెసులుబాటు ఉంటుంది. పెట్టుబడులను వివిధ సాధనాల్లో డైవర్సిఫై చేయడం వల్ల రాబడుల కోసం కేవలం ఒకే సాధనంపై ఆధారపడాల్సిన రిస్క్‌లు తగ్గుతాయని సంస్థ ప్రోడక్ట్ హెడ్ సాహిల్ కపూర్ తెలిపారు.




## 33 ఏళ్ల క్రితం సాధారణ వెబ్ అడ్రస్‌గా రిజిస్టర్.. ఇప్పుడు రూ. 600 కోట్లు!

పేరులో నేముంది అని అనుకుంటే పొరపాటు. ఒక చిన్న పదం. కేవలం రెండే రెండక్షరాలు. కానీ దాని విలువ భారత కరెన్సీలో అక్షరాల 600 కోట్లు. ఆ రెండక్షరాల పదం ఏంటి? దానిని రూ.600కోట్లకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏంటి? దాని కథా కమా మిషు ఏంటో తెలుసుకుందాం పదండి.

ఇంటర్నెట్‌లో డొమైన్ అడ్రస్ చాలా విలువైంది. వెబ్‌సైట్ డొమైన ట్రెండింగ్‌లో ఉన్నా డిమాండ్ ఉండే బిజినెస్‌కు చెందినదైనా దాని ధర కోట్లు పలుకుతుంది. ఎంత ధరపెట్టైనా సరే దాన్ని కొనుగోలు చేస్తారు. అలాంటి వెబ్‌సైట్ డొమైన్ కళ్లు చెదిరే ధరకు అమ్ముడుపోయింది. క్రిప్టో.కామ్ వ్యవస్థాపకుడు క్రిస్ మార్జాలెక్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డొమైన్ ఏఐ డాట్ కామ్‌ను 70మిలియన్ డాలర్లు వెచ్చించి మరీ కొనుగోలు చేశారు. అంటే భారత కరెన్సీలో అక్షరాల రూ.600కోట్లు.ఇదే అత్యధికర ధర పలికిన డొమైన్‌లలో తొలి స్థానంలో నిలిచింది.ఏఐ ఇండస్ట్రీలో ప్రవేశించాలనుకున్నా క్రిప్టో.కామ్ సీఈవో క్రిస్ మార్జాలెక్ సూపర్ బౌల్ సమయంలో ఏఐ.కామ్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నారు. ఈ వెబ్‌సైట్‌లో ఏఐ పర్సనల్ అసిస్టెంట్ లాంచ్ కానుంది. ఈ ఏఐ అసిస్టెంట్ పర్సనల్ మెసేజ్‌లు పంపడంతో పాటు క్రిప్టో ట్రేడింగ్,యాప్స్ మేనేజ్ చేయడంతో పాటు ఇతర కార్యకలాపాల్ని చక్కబెడుతోంది. చాట్‌జీపీటీ రాకతో టెక్నాలజీ కొంతపుంతలు తొక్కుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ఎప్పటి నుంచో ఉన్నా.. చాట్‌జీపీటీ రాకతో సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఏఐ వినియోగం రోజురోజుకి పెరిగిపోతుంది. ప్రతిరంగంలో ఏఐ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఈ తరుణంలో ఏఐ .కామ్ డొమైన్‌ను అంత భారీ మొత్తంలో వెచ్చించారు. భవిష్యత్ మొత్తం ఏఐదేనని,అన్నీ రంగాల్లో ఏఐ పెత్తనం చెలాయిస్తుందంటున్నారు.

ఇది స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ అయినప్పటికీ రానున్న 20ఏళ్లలో పెట్టుబడులు అమాంతం పెరుగుతాయని క్రిస్ చెబుతున్నారు. ఏఐతో ప్రీమియం డొమైన్లు బ్రాండింగ్‌ను పెంచుతాయని అంటున్నారు. 2016లో క్రిస్.. క్రిప్టో.కామ్‌ను ప్రారంభించారు. అప్పటికే మార్కెట్‌లో క్రిప్టోప్లాట్‌ఫారమ్స్ ఉన్నాయి. అయినప్పటికీ కంపెనీ వేగంగా వృద్ధి సాధించింది. ప్రస్తుతం, ఏడాదికి 1.5బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. మార్కెటింగ్ బ్రాండింగ్‌పై భారీ ఇన్వెస్ట్ చేసింది.2021లో స్టేడియం బ్రాండింగ్‌పై సుమారు 700 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ట్రంప్ మీడియాతో బిజినెస్ డీల్స్ కూడా చేసింది. ఇవన్నీ గ్లోబల్ బ్రాండింగ్ రికగ్నైజేషన్‌ను పెంచాయి. ఇప్పుడు ఏఐ.కామ్ కొనుగోలుతో సరికొత్త రికార్డులు సృష్టించారు క్రిస్ మార్స్‌జాలెక్.

ఇక క్రిస్ మార్స్‌జాలెక్ ఏఐ.కామ్ డొమైన్‌ను మలేషియన్ టెక్ ఎంట్రప్రెన్యూర్ అర్వ్యాన్ ఇస్మాయిల్ నుంచి కొనుగోలు చేశారు. ఈ డొమైన్‌ను ఇస్మాయిల్ 1993లో 100 డాలర్లు చెల్లించి రిజిస్టర్ చేసుకున్నారు. ఆ సమయంలో ఇది సాధారణ వెబ్ అడ్రస్ మాత్రమే. కానీ కాలక్రమేణా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రాధాన్యం పెరిగిన కొద్దీ, ఈ డొమైన్ విలువ ఆకాశాన్ని తాకింది.2025 ఏప్రిల్‌లో అర్వ్యాన్ ఇస్మాయిల్ ఈ డొమైన్‌ను క్రిస్ మార్జాలెక్‌కి విక్రయించారు. ధర? అక్షరాల 70 మిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.600 కోట్లు. ఇది ఇప్పటివరకు పబ్లిక్‌గా వెల్లడైన అత్యధిక ధర పలికిన డొమైన్ ట్రాన్సాక్షన్‌గా గుర్తింపు పొందింది. ఒకప్పుడు 100 డాలర్ల విలువైన ఈ డిజిటల్ ఆస్తి 30 ఏళ్ల తర్వాత 70 మిలియన్ డాలర్లకు అమ్ముడవడం, ఇంటర్నెట్‌లో డొమైన్‌ల ప్రాధాన్యం ఎంత పెరిగిందో చూపించే అద్భుత ఉదాహరణ. ఏఐ భవిష్యత్తు అన్నీ రంగాల్లో ఆధిపత్యం చెలాయిస్తుందని భావిస్తున్న ఈ తరుణంలో ఏఐ.కామ్‌పై వంటి ప్రీమియం డొమైన్‌ను సొంతం చేసుకోవడం ఒక వ్యూహాత్మక పెట్టుబడిగా మారింది. ఇది కేవలం ఒక వెబ్ అడ్రస్ కాదు, భవిష్యత్ టెక్నాలజీకి ప్రతీకగా నిలిచే బ్రాండింగ్ ఆస్తి.



## విజయ్ దేవరకొండ పెళ్లికి వెళుతున్నారా?: తరుణ్ భాస్కర్ ఏమన్నారంటే

హైదరాబాద్: విజయ్ దేవరకొండ పెళ్లిపై ప్రశ్న ఎదురవగా దర్శక, నటుడు తరుణ్ భాస్కర్ (Tharun Bhascker) స్పందించారు. 'త్వరలో విజయ్ వివాహం అని తెలిసింది. మీరు వెళుతున్నారా?' అని అడగ్గా.. "నాకు ఆహ్వానం అందలేదు. ఒకవేళ ఇన్విటేషన్ వస్తే మీకు వాట్సాప్‌లో ఫార్వాడ్ చేస్తా. కలిసి వెళదాం" అని సమాధానమిచ్చారు. తన కొత్త సినిమా 'గాయపడ్డ సింహం' (GaayaPadda Simham) ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన సందడి చేశారు. ఈ నెల 26న విజయ్-రష్మికల వివాహం చేసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తరుణ్‌ను ప్రశ్నించారు. విజయ్- తరుణ్ స్నేహితులన్న సంగతి తెలిసిందే. విజయ్ హీరోగా తరుణ్ తెరకెక్కించిన 'పెళ్లిచూపులు' (2016) బాక్సాఫీసు వద్ద హిట్‌గా నిలవడమే కాదు జాతీయ అవార్డునూ దక్కించుకుంది.


**తదుపరి ప్రాజెక్టులు**

"హీరోగా మూడు ప్రాజెక్టులు అంగీకరించా. వాటిలోని 'ఓం శాంతి శాంతి శాంతిః' ఇటీవల విడుదలైంది. రెండో సినిమా ఇదే (గాయపడ్డ సింహం). మరో సినిమా రాబోతోంది. దర్శకుడిగా ప్రస్తుతం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ తెరకెక్కిస్తున్నా. అక్టోబరు/ నవంబరులో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఓటీటీ సంస్థ కోసం ఓ ప్రాజెక్టు చేస్తున్నా. వెంకటేశ్‌తో చేయాలనుకున్న మూవీ స్క్రిప్టు దశలో ఉంది. వేరే కథ ఒకటి రాస్తున్నా" అని తెలిపారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన 'గాయపడ్డ సింహం'లో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. ఈ వినోదాత్మక చిత్రం త్వరలో విడుదల కానుంది.



# నేను ఏదీ అర్థం చేసుకోలేకున్నా: తమన్నా

అందం ఏ ఒక్కరికీ సొంతం కాదు. అయినా ఎవరి అందం వారికి ముద్దే. అదేవిధంగా అందం అనేది చూసేవారి దృష్టిని బట్టి ఉంటుందంటారు. అలాంటి అందాల్లో తమన్నా అందమే వేరయా అని పేర్కొనవచ్చు. ఈమె ఒక్కో చిత్రంలో ఒక్కో విధంగా తన అందాలను మార్చుకుంటారు. అలా ఏ కోణంలో చూసిన తమన్నా అందంగానే కనిపిస్తారు. అలా తన అందచందాలతో, హావభావాలతో రెండు దశాబ్దాలకు పైగా భారతీయ సినీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. కాగా ఈ 36 ఏళ్ల భామ ఇప్పటికీ కథానాయకిగా నాటౌట్‌గా నిలబడడం మరో విశేషం. అదేవిధంగా ఐటం సాంగ్స్‌లోనూ యువతను గిలిగింతలు పెట్టడంలో ఈ బ్యూటీది ప్రత్యేక శైలి అనే చెప్పాలి. అలా ఒక్క ఐటమ్ సాంగ్‌కు రూ.6 కోట్లు డిమాండ్ చేస్తున్న నటి తమన్నా. కాగా చిన్న గ్యాప్ తర్వాత ఈ అమ్మడు తాజాగా కోలీవుడ్లో విశాల్‌కు జంటగా సుందర్.సి దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఆ మధ్య ప్రేమ వ్యవహారంలో చిక్కుకొని వార్తల్లో నిలిచారు. విజయ్‌వర్మ అనే బాలీవుడ్ నటుడితో కొద్దిరోజులు చట్టాపట్టాలేసుకొని తిరిగారు. అదీ మూడునాళ్ల ముచ్చటే అయ్యింది. కొంతకాలానికే వీరి మధ్య బ్రేకప్ అయ్యింది. ఇటీవల ఇకపై ఐటెం సాంగ్స్‌లో నటించనని పేర్కొన్న తమన్నా మళ్లీ ఇప్పుడు ప్రముఖ హీరోల చిత్రాల్లో అలాంటి పాటల్లో నటించడానికి సిద్ధమే అని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. తమన్నా లైఫ్‌లో తను తీసుకున్న నిర్ణయాలనే పలుమార్లు మార్చుకుంటూ వెళ్తుందా అంటూ నెటిజన్లు కామెంట్లు చేశారు. ఇలాంటి ప్రశ్నే ఇటీవల ఒక కార్యక్రమంలో ఎదురైన ప్రశ్నకు తమన్నా ఆసక్తికరమైన బదులు చెప్పారు. తనను తానే అర్థం చేసుకోలేకపోతున్నానని, ఇతరులు ఎలా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు.






## రివ్యూ కమిటీకి 'జననాయగన్'..
# ఈసారైనా విడుదల అయ్యేనా?



విజయ్ (Vijay) కథానాయకుడిగా హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జన నాయగన్' (Jana Nayagan). సెన్సార్ బోర్డు వివాదంతో సంక్రాంతికి విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడింది. మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టు, సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ ఇలా గత నెల అంతా ఈ మూవీ వార్తల్లో నిలిచింది. తాజాగా ఈ మూవీ విడుదలకు అడుగులు పడుతున్నాయి. కోర్టు ఆదేశాల మేరకు చిత్ర బృందం 'జన నాయగన్'ను సెన్సార్ బోర్డు రివ్యూ కమిటీకి పంపింది. వీలైనంత త్వరగా సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అంతా సవ్యంగా జరిగితే వచ్చే నెలలో ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశం కనపడుతోంది.

### ఇదీ వివాదం..

జన నాయగన్‌కు (Jana Nayagan Movie) యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. సుదీర్ఘ వాదనల అనంతరం 'జన నాయగన్' సినిమాలో విదేశీ శక్తుల సాయంతో దేశంలో మత కల్లోలం సృష్టించే సన్నివేశాలు ఉన్నాయని మద్రాసు హైకోర్టు తెలిపింది. దీంతో సెన్సార్‌బోర్డు సమీక్ష కమిటీ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకే చిత్రాన్ని రివైజింగ్ కమిటీ పంపడానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో 'జన నాయగన్' చిత్ర బృందం మూవీని మరోసారి రివ్యూ కమిటీకి పంపింది.



## మరో ఘటన జరగకముందే జాగ్రత్త పడండి: సోనూసూద్

మీర్జాపూర్' సిరీస్‌తో విశేష క్రేజ్ సొంతం చేసుకున్న నటుడు పంకజ్ త్రిపాఠి (Pankaj Tripathi). 2024 వరకూ ఏడాదికి మూడు/నాలుగు చిత్రాల్లో కనిపించిన ఆయన.. గతేడాది 'మెట్రో.. ఇన్ దినో'లో మాత్రమే కనిపించారు. నటనకు బ్రేక్ ఇవ్వడంపై తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. కొన్నాళ్లపాటు తీరిక లేకుండా నటించడంతో విరామం తీసుకోవాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. తనలోని నటుడిని సంతృప్తి పరిచే పాత్రలనే ఎప్పుడూ ఎంపిక చేసుకుంటానని, ఈఎంఐ కట్టేందుకో, మనుగడ కోసమో నటించలేను అని అన్నారు.వరుస ప్రాజెక్టుల్లో యాక్ట్ చేయడం వల్ల విసుగు చెందా. అలసటకూ గురయ్యా. నా పనిని నేను ఆస్వాదించలేకపోయా. అందుకే బ్రేక్ తీసుకోవడం అవసరమైంది. పాత్రల ఎంపికపై ఇప్పుడు మరింత శ్రద్ధ చూపిస్తున్నా. నాలో అమితాసక్తి రేకెత్తించే పని కోసమే ఇంటి నుంచి బయటకు వెళుతున్నా. నా వద్దకు వచ్చే సినిమా/సిరీస్‌లన్నింటినీ చేయాలనుకోవడం లేదు" అని వివరించారు. 49 ఏళ్ల పంకజ్.. 2003 నుంచి చిత్ర పరిశ్రమలో ఉన్నారు. ఆ ఏడాది విడుదలైన కన్నడ సినిమా 'చిగురిడా కనసు', 2004లో రిలీజ్ అయిన 'రన్' (హిందీ)లో ప్రాధాన్యం లేని పాత్రల్లో కనిపించిన ఆయన.. 'అపహరణ్' (2005)లోని కీలక పాత్రతో సత్తా చాటారు. 'రావణ్', 'ఆక్రోశ్', 'అగ్నిపథ్', 'గ్యాంగ్స్ ఆఫ్ వాసేపుర్'.. ఇలా పవర్‌ఫుల్ యాక్షన్ సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించారు. 'దూసుకెళ్తా'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన త్రిపాఠి.. వెబ్‌సిరీస్‌లతో కెరీర్‌లో మరింత దూసుకెళ్లారు. 'సేక్రెడ్ గేమ్స్', 'క్రిమినల్ జస్టిస్' తదితర సిరీస్‌లతో భాషలతో సంబంధం లేకుండా అభిమానుల్ని సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా 'మీర్జాపూర్'లో కలీన్ భయ్యాగా అదరగొట్టారు. ఈ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ సెప్టెంబరు 4న సినిమాగా థియేటర్లలో విడుదల కానుంది.

## ఇళయరాజా బయోపిక్‌పై రూమర్స్.. స్పందించిన ధనుష్ టీమ్

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా బయోపిక్ (Ilaiyaraaja Biopic) నుంచి దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ (Arun Matheswaran) వైదొలిగారని, ఆయన స్థానంలో మరొకరు ఆ ప్రాజెక్టును తెరకెక్కిస్తున్నారంటూ రూమర్స్ వచ్చాయి. వీటిపై ధనుష్ టీమ్ (Dhanush Team) స్పందించింది. ఆ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'డీసీ' (DC Movie) సినిమా పూర్తికాగానే అరుణ్.. ఇళయరాజా బయోపిక్ షూటింగ్ పునఃప్రారంభిస్తారని తెలిపింది. ధనుష్ ప్రధాన పాత్రలో ఇప్పటికే ఈ బయోపిక్ మొదలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్‌ను హీరోగా పరిచయం చేస్తూ 'డీసీ'ని ప్రారంభించారు అరుణ్. ఈ క్రమంలోనే.. ఇళయరాజా బయోపిక్‌కు ఆయన దర్శకత్వం వహించట్లేదంటూ రూమర్స్ వచ్చాయి. ధనుష్ అరుణ్ కాంబినేషన్‌లో గతంలో.. 'కెప్టెన్ మిల్లర్' మూవీ వచ్చింది. ధనుష్ ప్రస్తుతం 'డీ 55' (వర్కింగ్ టైటిల్), 'కర' సినిమాల్లో నటిస్తున్నారు.




## మెగా ఫ్యామిలీలో ట్విన్స్..
# ఉపాసన ఎమోషనల్ పోస్ట్

రామ్ చరణ్ సతీమణి ఉపాసన ఇటీవలే కవలలకు జన్మనిచ్చింది. జనవరి 31న ఓ బాబు, పాపకు వెల్‌కమ్ చెప్పారు మెగా ఫ్యామిలీ ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ప్రకటించారు. దీంతో మెగా ఫ్యాన్స్‌తో పాటు టాలీవుడ్ అభిమానులు ఈ సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. అయితే తాజాగా ఉపాసన ఓ ఎమోషనల్ పోస్ట్ చేసింది. ట్విటర్ వేదికగా ఓ వీడియోను షేర్ చేసింది. ట్విన్స్‌కు జన్మనిచ్చిన తర్వాత ఉపాసన చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉపాసన తన పోస్ట్‌లో రాస్తూ.." ఇది చూసిన ప్రతిసారీ నా హృదయం సంతోషంతో నిండిపోతోంది. మన చుట్టూ ఉన్న ప్రేమ, బలం, సానుకూలతకు నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. నా రెండు చేతులు జోడించి ధన్యవాదాలు చెబుతున్నా. మా కుటుంబం నిజంగా అదృష్టవంతులం. తేజస్వి గారు.. అపోలో హాస్పిటల్స్ బృందం నిబద్ధతతో మాకోసం పనిచేశారు. రామ్ చరణ్ అభిమానులు, శ్రేయోభిలాషుల ప్రేమ మనసు నుంచి వచ్చిందని నాకు తెలుసు. మీరు మా పిల్లలను ఎల్లప్పుడూ రక్షిస్తారని.. వారి భద్రతను గౌరవిస్తారని నేను నమ్ముతున్నా. ప్రపంచవ్యాప్తంగా మా కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ ఆశీర్వాదాలు ఎప్పటికీ మా హృదయంలో పదిలంగా ఉంటాయి' అంటూ ట్వీట్ చేసింది. ఇది చూసిన గ్లోబల్ స్టార్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# భళా దక్షిణేశ్వర్

## – డేవిస్ కప్‌లో నెదర్లాండ్స్‌కు భారత్ చెక్



యువ ఆటగాడు దక్షిణేశ్వర్ అద్భుత ప్రదర్శనతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలవడంతో డేవిస్‌కప్ టెన్నిస్ టోర్నీ ప్రపంచ గ్రూప్‌లో భారత్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయర్స్ పోరులో 32తో బలమైన నెదర్లాండ్స్‌కు షాకిచ్చింది. నెదర్లాండ్స్ ర్యాంకు 6 కాగా.. భారత్ 33వ స్థానంలో ఉంది. శనివారం తలో మ్యాచ్ గెలవడంతో టై 11తో సమం కాగా.. ఆదివారం పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రిదక్షిణేశ్వర్ సురేశ్ జంట 76 (70), 36, 76 (71)తో సండర్ అరెండ్స్‌డేవిడ్ పెల్ ద్వయంపై గెలిచి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. అనంతరం రివర్స్ సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 75, 16, 46తో జేస్పర్ డి జాంగ్ చేతిలో కంగుతినడంతో టై మళ్లీ 22తో సమమైంది. నిర్ణయాత్మక రెండో రివర్స్ సింగిల్స్‌లో దక్షిణేశ్వర్ సురేశ్ 64, 76 (74)తో డెన్ ఓడెన్‌ను ఓడించి భారత్‌కు విజయాన్ని అందించాడు. అతను శనివారం తొలి సింగిల్స్‌లోనూ నెగ్గాడు.

## ఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ మిస్..



ఓ బ్యాటర్ ఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. రంజీ ట్రోఫీలో ఆంధ్రతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామి (299; 596 బంతుల్లో 31 ఫోర్లు, 6 సిక్స్‌లు) త్రుటిలో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. షేక్ రషీద్ బౌలింగ్‌లో సుదీప్ వెనుదిరిగాడు. ఈ బ్యాటర్ తీవ్ర నిరాశతో పెవిలియన్‌కు చేరుతున్న క్రమంలో ఆంధ్ర ఆటగాళ్లు బాధపడకు అంటూ ఓదార్చారు. మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు, సహచర ఆటగాళ్లు సుదీప్ కుమార్ ఘరామికి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 299 పరుగుల వద్ద వెనుదిరిగిన తొలి భారత బ్యాటర్‌గా సుదీప్ నిలిచాడు. ఓవరాల్‌గా మూడోవాడు. న్యూజిలాండ్‌కు చెందిన మార్టిన్ క్రోవ్.. 1991లో శ్రీలంకతో టెస్టు మ్యాచ్‌లో 299 రన్స్ వద్ద ఔటయ్యాడు. గ్లామోర్గాన్‌కు చెందిన మైకేల్ పావెల్ కూడా 2006లో గ్లౌసెస్టర్‌షైర్‌పై 299 రన్స్ వద్ద వెనుదిరిగాడు.

## దక్షిణాఫ్రికా శుభారంభం.. కెనడాపై ఘన విజయం




టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసింది. అహ్మదాబాద్ వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. ఓపెనర్ మార్క్రమ్ (59) అర్ధశతకం చేశాడు. డికాక్ (25), రికెల్టన్ (33), డేవిడ్ మిల్లర్ (39*), స్టబ్స్ (34*) రాణించారు. కెనడా బౌలర్లలో కలీమ్ సనా 2 వికెట్లు పడగొట్టగా బజ్వా ఒక వికెట్ తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన కెనడా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 156 పరుగులకు పరిమితమైంది. నవ్‌నీత్ ధలివాల్ (64) ఒంటరి పోరాటం చేశాడు. హర్ష్ థాకెర్ (33) మినహా మిగతా వారెవ్వరూ రాణించలేదు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంగిడి 4 వికెట్లు పడగొట్టగా.. మార్కో జాన్సన్ 2, రబాడ, కార్బిన్ బోచ్ ఒక్కో వికెట్ తీశారు.

## క్రికెట్ ప్రపంచంలోకి ఎంటరైన ట్రంప్

అనునిత్యం వివాదాస్పద నిర్ణయాలతో వార్తల్లో నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తాజాగా క్రికెట్ ప్రపంచంలోకి కూడా ఎంటరయ్యాడు. భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో పాల్గొంటున్న తమ జట్టుకు (యూఎస్‌ఏ) ట్రంప్ మద్దతు ప్రకటించాడు. సోషల్ ట్రూత్‌లో ఓ ప్రత్యేక సందేశం పోస్ట్ చేస్తూ.. టీమ్ యూఎస్‌ఏ చాలా బలమైంది. అమెరికా మొత్తం మీ వెనుకే ఉంది అని పేర్కొన్నాడు. ట్రంప్ ఇచ్చిన మద్దతు యూఎస్‌ఏ జట్టులో కొత్త ఉత్సాహం నింపింది. రేపు (ఫిబ్రవరి 10) పాకిస్తాన్‌తో జరుగబోయే కీలక మ్యాచ్‌కు ముందు ట్రంప్ సందేశం యూఎస్‌ఏ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. ట్రంప్ మద్దతు అమెరికాలో క్రికెట్ ఎదుగుదలకు కొత్త ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వాస్తవానికి ట్రంప్‌కు క్రికెట్‌పై పెద్దగా అవగాహన లేదు. గోల్ఫ్, అమెరికన్ ఫుట్‌బాల్ వంటి క్రీడలపై అతనికి ప్రత్యేక ఆసక్తి ఉంది. అయితే ట్రంప్‌కు 2020లో అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ స్టేడియం (ప్రస్తుతం నరేంద్ర మోడి స్టేడియం) ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనుభవం ఉంది. భారత్‌తో వాణిజ్యపరమైన సంబంధాలు ఇప్పుడిప్పుడే బలపడుతున్న వేల, ట్రంప్ ప్రకటన భారతీయుల్లోనూ ఆసక్తి కలిగిస్తుంది. ట్రంప్ మద్దతు ఉంటే క్రికెట్ కూడా విశ్వక్రీడగా మారిపోయే అవకాశం ఉంది. అమెరికాలో క్రికెట్ అభివృద్ధి 2023లో ప్రారంభమైన మేజర్ లీగ్ క్రికెట్‌తో మొదలైంది. ఆ టోర్నీలో భారత్ తప్ప, ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్ క్రికెటర్లందరూ పాల్గొంటారు. 2024 టీ20 ప్రపంచకప్‌కు సహఆతిథ్యం ఇవ్వడంతో అమెరికా ప్రజలకు క్రికెట్ మరింత చేరువైంది. యూఎస్‌ఏలో ఇప్పటికే 150 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. ఇదిలా ఉంటే, యూఎస్‌ఏ జట్టు గత ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసి పెను సంచలనం సృష్టించింది. ప్రస్తుత ఎడిషన్‌లోనూ ఆ జట్టు మరో సంచలనం సాధించే అవకాశం ఉంది. టోర్నీ ఓపెనర్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఎస్‌ఏ ఆటగాళ్లు అద్భుతమైన పోరాటపటిమ కనబర్చారు. ఈ మ్యాచ్‌లో వారి పోరాటానికి క్రికెట్ అభిమానులంతా ముగ్ధులయ్యారు. టీమిండియా ఆ మ్యాచ్‌ను మాత్రమే గెలిచింది కానీ, యూఎస్‌ఏ జట్టు మాత్రం క్రికెట్ ప్రపంచాన్నంతా గెలిచింది.

# భారత్‌తో మ్యాచ్‌పై పాక్‌కు 24 గంటల డెడ్‌లైన్!

టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇది ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత్, పాక్ మ్యాచ్‌ను ఎలాగైనా నిర్వహించాలని పట్టుదలతో ఉన్న ఐసీసీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుతో సంప్రదింపులు జరుపుతోంది. లాహోర్‌లో ఆదివారం పీసీబీ ఛైర్మన్ మోసిన్ నక్వీ, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం సమావేశమయ్యారు. ఐదు గంటలకు పైగా ఈ చర్చలు సాగాయి. ఐసీసీ ముందు పీసీబీ మూడు డిమాండ్లు ఉంచినట్లు సమాచారం. ఇందులో మొదటి బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధి కోసం ఐసీసీ నుంచి మరిన్ని నిధులు ఇవ్వడం. రెండోది టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొననప్పటికీ బంగ్లాదేశ్‌కు పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం. మూడోది భవిష్యత్‌లో బంగ్లాదేశ్‌కు ఐసీసీ ఈవెంట్ ఆతిథ్య హక్కులు ఇవ్వడం. ఈ క్రమంలో భారత్‌తో మ్యాచ్ ఆడే విషయంపై పాక్‌కు ఐసీసీ 24 గంటల డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. పీసీబీ తుది నిర్ణయం ప్రకటించే ముందు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సోమవారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను మోసిన్ నక్వీ కలిసే అవకాశముంది. పాక్ మనసు మార్చుకొని మ్యాచ్ ఆడేందుకు సుముఖత వ్యక్తం చేస్తుందని ఐసీసీ అధికారులు ఆశిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం భారత్, పాక్ మ్యాచ్ ఈనెల 15న కొలంబోలో జరగాల్సిఉంది. భద్రతా కారణాలతో భారత్‌లో ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. తర్వాత బంగ్లాను టోర్నీ నుంచి తప్పించి స్కాట్లాండ్‌కు అవకాశమిచ్చారు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్ మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. పీసీబీతో ఐసీసీ చర్చలు జరుపుతున్న నేపథ్యంలో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ అంశంపై స్పందించారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నాదానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ''ఈ అంశాలన్నింటిపై నేను గానీ, బీసీసీఐ గానీ ఎలాంటి కామెంట్ చేయం. ఈ విషయాన్ని పూర్తిగా ఐసీసీకి అప్పగించాం. వారు




ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాం'' అని శుక్లా పేర్కొన్నారు.

# సూర్యకుమార్ వల్ల నా పని ఈజీ అవుతోంది

## ..ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్

టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసలు కురిపించాడు. ఆటగాళ్లతో ఎంతో కలుపుగోలుగా ఉంటాడని, దీంతో పొట్టి ఫార్మాట్‌లో కోచ్‌గా తన పనిని చాలా సులభతరం చేస్తున్నాడని పేర్కొన్నాడు. ''సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన కెప్టెన్. బ్యాటర్‌గా తనదైన షాట్లతో విధ్వంసం సృష్టించే ఇతను సారథిగా అదరగొడుతున్నాడు. సహచర ఆటగాళ్లతో మంచి సంబంధాలను కలిగి ఉంటాడు. వారితో చక్కగా మాట్లాడతాడు. మైదానంలో ప్రశాంతంగా ఉంటూ తోటి ఆటగాళ్లకు మద్దతు ఇస్తున్నాడు. సూర్య జట్టు వాతావరణాన్ని చాలా ప్రశాంతంగా ఉంచడటంతో కోచ్‌గా నా పని మరింత సులభతరం అవుతోంది. ఆటగాడిగా సూర్య కొన్నిసార్లు తప్పులు చేయొచ్చు. కెప్టెన్‌గా మాత్రం అన్ని విభాగాల్లో సమర్థుడు. అలాంటి వ్యక్తి భారత జట్టును నడిపించడం గొప్ప విషయం. సూర్య జట్టు కోసం సరైన నిర్ణయాలు తీసుకుంటాడు'' అని గంభీర్ ప్రశంసించాడు. టీ20 ప్రపంచ కప్‌లో యూఎస్‌ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ (84*; 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీమ్ఇండియా ఒక దశలో 13 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 77 పరుగులతో కష్టాల్లో పడింది. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో సూర్య ఎదురుదాడికి దిగి భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో భారత్ 161/9తో ఇన్నింగ్స్‌ను ముగించింది. యూఎస్‌ఏ 132/8కి పరిమితమైంది.



# వైభవ్‌ను త్వరగా సీనియర్ జట్టులోకి తీసుకోవాలి

## ... కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

కొన్ని రోజులుగా అండర్ 19 క్రికెట్‌లో టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ (Vaibhav Sooryavanshi) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో అలరిస్తున్నాడు. 14 ఏళ్ల వయసులోనే ఈ స్థాయిలో విరుచుపడుతుండటంతో ఈ కుర్రాడిని త్వరగా భారత జట్టులోకి తీసుకోవాలనే అభిమానులు కోరుతున్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా వైభవ్‌ను వీలైనంత తొందరగా సీనియర్ల జట్టులో ఆడించాలని కోరారు. మరింత గౌరవానికి సూర్యవంశీ పూర్తిగా అర్హుడని పేర్కొన్న థరూర్, ఇలాంటి క్రికెటర్ తరానికి ఒక్కరు మాత్రమే ఉంటారని పేర్కొన్నారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ కూడా 14 ఏళ్ల వయసులో మైదానంలో తన అద్భుతమైన ఆటతో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశాడని శశిథూర్ గుర్తు చేసుకున్నారు. సచిన్ కుర్రాడిగా ఉన్నప్పుడే టీమ్ఇండియా తరఫున అరంగేట్రం చేశాడని, వైభవ్‌ను కూడా త్వరగా భారత జట్టు తరఫున ఆడించాలన్నారు. ఈ మేరకు శశిథరూర్ తన ఎక్స్ ఖాతాలో సూర్యవంశీకి సంబంధించిన ఓ యాడ్ ఫొటోను పోస్టు చేస్తూ కామెంట్ చేశారు. గతేడాది ఐపీఎల్‌లో రాజస్థాన్‌కు ఆడిన వైభవ్ 35 బంతుల్లోనే సెంచరీ చేసి వార్తల్లో నిలిచాడు. అప్పటినుంచి అతడి హవా కొనసాగుతూనే ఉంది. ఇటీవల ముగిసిన అండర్ 19 ప్రపంచకప్‌లోనూ అదరగొట్టాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఫైనల్‌లో ఇతను విశ్వరూపం ప్రదర్శించాడు. 55 బంతుల్లోనే సెంచరీ చేశాడు. మొత్తం మీద ఆ మ్యాచ్‌లో 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను గెలుచుకున్నాడు.




## టీ20 ప్రపంచ కప్.. చెలరేగిన జింబాబ్వే బౌలర్లు.. ఒమన్ 103 ఆలౌట్



టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా కొలంబోలో జింబాబ్వే, ఒమన్ (ZIM vs OMAN) తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఒమన్.. 19.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. వినాయక్ శుక్లా (28) టాప్ స్కోరర్. టాప్ 5 బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదు. అమీర్ కలీం (5), జతీందర్ సింగ్ (5), హమ్మద్ మీర్జా (0), కరణ్ సోనావాలే (0), వసీమ్ అలీ (3) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. దీంతో జింబాబ్వే 27 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో వినాయక్ శుక్లా, సుఫ్యాన్ మెహమూద్ (25) ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. తొమ్మిదో స్థానంలో వచ్చిన నదీమ్ ఖాన్ (20) పరుగులు చేశాడు. జింబాబ్వే బౌలర్లలో ముజారబానీ (3/16), రిచర్డ్ నగరవ (3/10), బ్రాడ్ ఎవాన్స్ (3/18) సత్తా చాటారు.

## వార్మప్ మ్యాచ్‌లో గాయం.. హర్షిత్ రాణాకు సర్జరీ



టీ20 ప్రపంచ కప్ 2026లో ఆడాలని కలలు కన్న టీమ్ఇండియా ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే. వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సౌతాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ మోకాలికి గాయమైంది. దీంతో అతడు టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. హర్షిత్ స్థానంలో మహ్మద్ సిరాజ్‌కు చోటు కల్పించారు. తాజాగా రాణాకు శస్త్రచికిత్స చేశారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి హర్షిత్ ఇన్‌స్టా వేదికగా అప్‌డేట్ ఇచ్చాడు. ఆస్పత్రిలో బెడ్‌పై ఉన్న ఫొటో షేర్ చేస్తూ ''సర్జరీ విజయవంతంగా పూర్తయింది. ఇప్పుడు కోలుకోవడం, నేను ఇష్టపడేదాన్ని తిరిగి పొందడంపై దృష్టిపెట్టాను'' అని పోస్టు పెట్టాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ విషయానికొస్తే.. యూఎస్‌ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్ఇండియా 29 పరుగుల తేడాతో గెలిచింది. టీమ్ఇండియా తదుపరి మ్యాచ్‌లో నమీబియాతో ఫిబ్రవరి 12న దిల్లీలో తలపడనుంది.